సాక్షి కర్నూలు

గురువారం, 17, ఆగస్టు, 2023



పూజలకు వేళాయె!

శ్రీశైలంలో శ్రావణమాస పూజలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. - వివరాలు 8లో▸



సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి, జ్వాలా వీరభద్రస్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు.



'సుంకేసుల'లో 0.990 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ ఫ్లో పూర్తిగా నిలిచిపోయిందన్నారు.

న్యూస్‌రీల్

హెచ్‌ఆర్‌సీ కార్యాలయ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, చిత్రంలో కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) కార్యాలయ అంతర్గత నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన బళ్లారి చౌరస్తాలోని రాగమయూరిలో హెచ్‌ఆర్‌సీకి కేటాయించిన తాత్కాలిక భవనంలో జరుగుతున్న అంతర్గత పనులను కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి పరిశీలించారు. హెచ్‌ఆర్‌సీకి కేటాయించిన భవనంలోని అంతర్గత పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలోనే అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని రాగమయూరి సంస్థ సెక్రటరీ వివరించారు. నిర్మాణానికి సంబంధించిన బిల్లులను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన ఆదేశించారు. కాగా, కార్యాలయానికి అవసరమైన ఫర్నిచర్, ఇతర సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆయనకు వివరించారు. వీరి వెంట డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ ఉన్నారు.

పెద్దాసుపత్రికి బీపీ ఆపరేటర్లు విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఓ దాత 10 బీపీ ఆపరేటర్లను విరాళంగా అందజేశారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకట రంగారెడ్డి ఏఎంసీ, గైనకాలజీ, క్యాజువాలిటీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు పంపించారు. ఆసుపత్రిలో సేవలను ఉపయోగించుకున్నందుకు ఓ దాత వీటిని విరాళంగా అందజేయడం విశేషం.

అంతర్జాతీయ సదస్సుకు రైతు బిడ్డ

- ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అరుదైన అవకాశం



తల్లిదండ్రులతో శివలింగమ్మ

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును అందించే లక్ష్యంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 10 మంది విద్యా ర్థులతో కూడిన ప్రతినిధి బృందం అమెరికాలో పర్యటించనుంది. ఇందుకు జిల్లాలోని ఆదోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థి ఎం.శివలింగమ్మ ఎంపికైంది. ఈ విషయం బుధవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో తల్లిదండ్రులతో కలిసి ఆ అమ్మాయి విజయవాడకు బయలుదేరింది. కౌతాళం మండలం పొదలకుంట గ్రామానికి చెందిన సోమనాథ్, గంగమ్మ దంపతులకు నలుగురు సంతానం(ఇద్దరు కూతుర్లు, ఇద్దరు అబ్బాయిలు) కాగా చివరి అమ్మాయి ఎం.శివ లింగమ్మ. తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో పంటలు పండిస్తూ, కూలీ పనులకు వెళ్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కష్టపడుతున్నారు. శివలింగమ్మ ఆదోని కేజీబీవీలో 10వ తరతగతిలో 541 మార్కులు సాధించింది. ఇటీవలే క్రిష్ణగిరి మండలం కంబాలపాడు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్(బాలికల) స్కూల్‌లో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది.

అంతర్జాతీయ వేదికపై ప్రసంగం

ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ గుర్తింపును ఇచ్చేందుకు 10 మంది విద్యార్థుల బృందం వచ్చే నెల 17 నుంచి 27వ తేదీ వరకు అమెరికాలో పర్యటించనున్నారు. వచ్చే నెల 18, 19 తేదిల్లో న్యూయార్క్‌లో నగరంలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే సుస్థిర అభివృద్ధి అనే అంశంపై జరిగే ప్రత్యేక సదస్సులో వివిధ దేశాల్లో విద్యా విధానం, ఆయా దేశాల్లో కల్పించే అవకాశాలపై చర్చించనున్నారు. ఇందులో అమెరికాతో పాటు కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి విద్యార్థులు పాల్గొననున్నారు. కస్తూర్బాల్లో చదివిన విద్యార్థి అంతర్జాతీయ వేదికపై ప్రసంగించే అవకాశానికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ తెలిపారు.

సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున, పకడ్బందీగా అమలవుతున్నా... ప్రతిపక్ష పార్టీలు, పచ్చ మీడియా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయి. సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం మరో శ్రీలంక కానుందని అడ్డగోలుగా విమర్శలు గుప్పించాయి. అప్పులపై కేంద్ర ప్రభుత్వ స్పష్టత ఇస్తున్నా గగ్గోలు పెట్టాయి. అయితే ప్రతిపక్ష పార్టీలు, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారంలో నిజం లేదని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పేదరికం తగ్గిందని ప్రకటించింది. డీబీటీ ద్వారా దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతున్నాయని నీతి ఆయోగ్ ప్రశంసించింది.

■ సాఫీగా జీవన యానం



ఈ చిత్రంలోని మహిళ పేరు కందోలు బేబి. గోనెగండ్ల మండలం నెరడుప్పల గ్రామానికి చెందిన మహిళ. గతంలో తీవ్ర పేదరికంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. ఇపుడు పేదరికం నుంచి బయటపడ్డారు. ఆటో ఏర్పాటు చేసుకొని జీవనోపాధిలో రాణిస్తున్నారు. మదర్ థెరిస్సా పొదుపు గ్రూపులో సభ్యురాలైన ఈ మహిళ ఉన్నతి కింద రూ.50 వేలు లోన్ తీసుకున్నారు. బ్యాంకుల నుంచి లింకేజీ రుణం తీసుకున్నారు. సమకూరిన డబ్బుతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆటో ఏర్పాటు చేసుకున్నారు. అనంతపురం జిల్లాలోని ఆర్‌డీటీలో డ్రైవింగ్‌లో శిక్షణ పొంది.. డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఆరు నెలలుగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. రోజుకు అన్ని ఖర్చులు పోగా రూ. 600–800 ప్రకారం నెల రూ.18వేల ఆదాయం పొందుతున్నారు. ఆటో నడుపడంలో ఎలాంటి ఇబ్బందులు లేవని జీవనం ప్రశాంతంగా సాగుతోందని స్పష్టం చేస్తున్నారు

పేదరికంపై 'సంక్షేమ' విజయం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో తగ్గిన పేదరికం
- నీతి ఆయోగ్ నివేదిక ద్వారా వెల్లడి
- టీడీపీ హయాంలో జనాభాలో 19.64 శాతం మంది పేదలు
- అప్పట్లో పేదరికంలో రాష్ట్రంలో మొదటి స్థానం నిలిచిన కర్నూలు
- సంక్షేమ పథకాల అమలుతో నేడు 12.84 శాతానికి తగ్గిన పేదరికం
- మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలు



కోన్ ఐస్‌క్రీమ్ కప్పులు తయారు చేస్తున్న మహిళలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు పేదరిక నిర్మూలనలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో 2019–2023 మధ్య కాలంలో పేదరికం గణనీయంగా తగ్గింది. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ నిర్ధారించింది. సర్వే ఫలితాలను ఇటీవల రాష్ట్రాలు, జిల్లాల వారీగా విడుదల చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2014– 2019 మధ్య19.64 శాతం పేదరికముంది. ఆ సమయంలో రాష్ట్రంలోనే పేదరికంలో ఉమ్మడి కర్నూలు జిల్లానే మొదటి స్థానంలో ఉంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4(ఎన్‌ఎఫ్‌హెచ్-4) ప్రకారం పేదరికంలో ఉన్న హెడ్‌కౌంట్ రేషియా 19.64లో 45.87 శాతం మంది మరీ దుర్భరమైన పేదరికంలో ఉన్నట్లు తేలింది. గ్లోబల్ మల్టీడైమెన్షినల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) 0.090 ఉంది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో 2019– 2023 మధ్యలో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది.

12.84 శాతానికి తగ్గిన పేదరికం...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరికం నిర్మూలన లక్ష్యంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. టీడీపీ హయాంలో 19.64 శాతం ఉన్న పేదరికం నేడు 12.84 శాతానికి తగ్గిపోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6.80 శాతం మంది పేదరికాన్ని జయించారు. పేదరికాన్ని తగ్గించడంలో విజయనగరం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండగా... ఉమ్మడి కర్నూలు జిల్లా ఐదో స్థానంలో నిలిచినట్లు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేస్తోంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5(ఎన్‌ఎఫ్‌హెచ్-5) ప్రకారం హెడ్ కౌంట్ రేషియో 12.84 శాతం(పేదరికంలో ఉన్న వారు) లో 42.32 శాతం మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నారు. ఎంపీఐ ఏకంగా 0.054గా నమోదు అయ్యింది. టీడీపీ హయాంలో పేదరికం సూచిక 0.090 ఉండగా... వైఎస్సార్‌సీపీ పాలనలో పేదరికం సూచిక 0.054కు తగ్గిపోయింది. దళారుల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నగదు బదిలీ చేయడాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించింది.

నీతి ఆయోగ్ సర్వే చేసిన అంశాలు ఇవే...

నీతి ఆయోగ్ పేదరికం స్థాయిని గుర్తించేందుకు హెల్త్, విద్య, జీవన ప్రమాణం(స్టాండర్డ్ ఆఫ్ లివింగ్) అంశాల్లో సర్వే చేపట్టింది. ఇందులో 12 అంశాలు ఉన్నాయి. ఆరోగ్యం(హెల్త్)లో పోషకాహారం(న్యూట్రీషయన్), శిశు మరణాలు, గర్భిణుల రక్షణ, విద్యకు సంబంధించి బడి వయస్సు పిల్లలందరూ పాఠశాలలో ఉండటం, పాఠశాలల్లో హాజరు పూర్తిగా ఉండటం, స్టాండర్డ్ ఆఫ్ లివింగ్‌లో పోషకాహారం, శానిటేషన్, తాగునీరు, విద్యుత్, హౌసింగ్, అసెట్స్, బ్యాంకుల్లో ఖాతా కలిగి ఉండటం.. ఈ అంశాల ఆధారంగా నీతి ఆయోగ్ పేదరిక సూచికను ప్రకటించింది. ఈ అంశాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో గడిచిన 4 ఏళ్లలో గణనీయమైన ప్రగతి సాధ్యమైంది. ఇందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం తీసుకున్న చర్యలే కారణం. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు. ఫలితంగా జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయి. మరో ఐదేళ్ల సంక్షేమ కార్యక్రమాలు అమలైతే పేదరికాన్ని సమూలంగా నిర్మూలించినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మచ్చుకు కొన్ని ...

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే నవరత్నాల అమలుపై సీఎం దృష్టి సారించారు. సంక్షేమంలో ఏ ఒక్క వర్గాన్ని విస్మరించలేదు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు.

- మహిళలకు సంబంధించి వైఎస్‌ఆర్ చేయూత, వైఎస్‌ఆర్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం.
- రైతులకు వైఎసార్ రైతుభరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నారు.
- చేనేతలకు సంబంధించి వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం.
- విద్యార్థులకు సంబంధించి అమ్మఒడి, జగనన్న విద్యా దీవన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద.
- వైఎస్‌ఆర్ వాహనమిత్ర వంటి పథకాలు అమలవుతుఆన్నయి.
- అర్హత కలిగిన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు కూడా నిర్మిస్తోంది.
- పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక తోడ్పాటు ఇచ్చేందుకు వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, షాదితోఫా అమలు చేస్తున్నారు.
- ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి.

కరోనాతో ఆర్థికంగా రాష్ట్రం కుదేలైనప్పటికి సంక్షేమ కార్యక్రమాలు ఆగలేదు. ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా నగదు బదిలీ అవుతోంది. మరోవైపు వ్యవసాయం కలసి వస్తోంది.రైతులు, మహిళల అభ్యున్నతికి బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇస్తున్నాయి. జిల్లా యంత్రాంగం కూడా సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తోంది. దీంతో జిల్లాలో పేదరికం గణనీయంగా తగ్గింది.

జీవనోపాధులు అభివృద్ధి చెందాయి



పేదరికం తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుచడం లక్ష్యంగా అనేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పారదర్శకంగా అమలు చేస్తున్నాం. విజిటబుల్ సోలార్ డ్రైయర్ల ద్వారా జిల్లాలో మహిళల జీవప్రమాణాలను మరింత అభివృద్ధి చేస్తున్నాం. జిల్లాలో పేదరికం గణనీయంగా తగ్గినట్లు నీతి ఆయోగ్ నిర్ధారించడం హర్షనీయం. ఈ సంస్థ ఆర్యోగం, విద్య, జీవన ప్రమాణంపై ఐదేళ్లకోసారి సర్వే చేస్తుంది. నీతి ఆయోగ్ సర్వే ప్రకారం పేదరికం 19.64 శాతం నుంచి 12.84 శాతానికి తగ్గడం శుభపరిణామం. విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు మహిళల జీవనోపాధులు అభివృద్ధి చెందాయి.

– డాక్టర్ జి.సృజన, జిల్లా కలెక్టర్

కర్నూలు జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన ఆర్థిక ప్రయోజనం

పథకం పేరు	పయోజనం పొందిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతుభరోసా	1608.08
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1108.78
అమ్మ ఒడి	2039.91
వైఎస్సార్ ఆసరా	592.62
వైఎస్సార్ చేయూత	666.76
వెఎస్సార్ సున్నా వడ్డీ	140.36
వెఎస్సార్ నేతన్న నేస్తం	47.87
జగనన్న వసతి దీవెన	142.05
జగనన్న విద్యాదీవెన	210.35
ఈబీసీ నేస్తం	79.72
కాపు నేస్తం	32.40

సచివాలయాలతో మెరుగైన సేవలు



ప్యానెల్ బోర్డుపై విద్యార్థుల అభ్యసనాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న

కల్లూరు: సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.ఎస్.ప్రద్యుమ్న సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ సచివాలయం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, దూపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించే అవకాశం ఉందనే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అనంతరం లక్ష్మీపురంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసి 6వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు ఐఎఫ్‌బీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) ద్వారా క్లాసులు చెప్పుతున్నారా? అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం పాఠశాలకు సరఫరా చేసిన డెస్కులు ఎలా ఉన్నాయని, మీకు బాగా నచ్చాయా అని విద్యార్థులను ప్రశ్నించగా చాలా బాగున్నాయని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ నాడు–నేడు నిధులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అదనపు గదుల నిర్మాణం కొనసాగుతోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. వీరి వెంట ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, డిటిసి శ్రీధర్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు, సీపీఓ అప్పలకొండ, సెట్కూరు సీఈఓ రమణ తదితరులు ఉన్నారు.

కేసీకి కృష్ణా జలాలు విడుదల



కేసీసీ లిఫ్ట్ నుంచి కృష్ణా జలాలను కాలువకు విడుదల చేసిన దృశ్యం

పగిడ్యాల: తీవ్ర వర్షాభావంతో ఎండిపోతున్న మొక్కజొన్న పైర్లను కాపాడేందుకు జలవనరుల శాఖ అధికారులు ముచ్చుమర్రి ఎత్తిపోతల కేసీసీ లిఫ్ట్ నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్ కృష్ణా జలాలను మూడు మోటార్ల ద్వారా 750 క్యూసెక్కులు విడుదల చేశారు. బుధవారం నియోజకవర్గంలోని పగిడ్యాల, నాగటూరు, కొణిదేల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పీకే ప్రాగటూరు, 80–బన్నూరు, జూపాడుబంగ్లా, తరిగోపుల, పడమర ప్రాతకోట, ఆంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె తదితర గ్రామాల నుంచి రైతులు తరలి వచ్చి నీటి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఆర్డీఓ ఎం.దాసు, డీఎస్పీ శ్రీనివాసరావు, నందికొట్కూరు అర్బన్ సీఐ విజయ్‌భాస్కర్, ఎస్‌ఐలు నాగార్జున, వెంకటసుబ్బయ్య, ఓబులేసు, క్రిష్ణమూర్తిలు ఘటనా స్థలానికి చేరి జలవనరుల శాఖ ఈఈ పురుషోత్తంతో చర్చించారు. ఉన్నతాధికారుల అనుమతితో సాయంత్రం 5 గంటలకు మూడు మోటార్ల ద్వారా నీటిని కేసీకి పంపింగ్ చేశారు. కేసీ కాలువలో పరుగులు తీస్తున్న కృష్ణా జలాలను చూసిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ మద్దిలేటి పాల్గొన్నారు.

'పోతిరెడ్డిపాడు' నుంచి కొనసాగుతున్న నీటివిడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు తగ్గి 11 వేల క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో శ్రీశైలం డ్యాంలో 862.00, పోతిరెడ్డిపాడు వద్ద 861.00 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు ఐదు గేట్ల ద్వారా నిన్నటి వరకు 12 వేల క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతుండగా ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కులు తగ్గి 11 వేల క్యూసెక్కుల నీరు ఎస్సార్‌ఎమ్సీలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 5,500 క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 4,500, కేసీ ఎస్కేప్ కాల్వకు 1,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు.

కొర్ర, కంది సాగు చేసుకోవచ్చు

- సబ్సిడీపై విత్తనాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై కొర్ర, కంది విత్తనాల పంపిణీ సెప్టెంబర్ నెల చివరి వరకు కొనసాగనుంది. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 2,80,659 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటం వల్ల సాగు అంతంతమాత్రంగానే ఉంది. అన్ని రకాల భూముల్లో కొర్ర, కంది స్వల్పకాలిక రకాలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. కొర్రలో ఎస్ఐఏ 3085 స్వల్పకాలిక రకం, కందిలో ఆశా రకం ప్రత్యామ్నాయ పంటలుగా సాగుకు అనుకూలమని, ఈ విత్తనాలు ఏపీ సీడ్స్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. కొర్రలు కిలో పూర్తి ధర రూ.67.50 ఉండగా.. సబ్సిడీ రూ.33.75 చెల్లించాల్సి ఉంది. కంది ఆశా రకం కిలో పూర్తి ధర రూ.111.40 ఉండగా.. సబ్సిడీ పోనూ రైతులు రూ.77.98 చెల్లించాలన్నారు. రైతులు విత్తనాల కోసం ఆర్‌బీకే ఇన్‌చార్జీలను సంప్రదించాలని సూచించారు.

మేయర్ ఓటు గల్లంతు

- పూర్తి స్థాయి విచారణ చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు
- ప్రతి ఒక్కరూ తమ ఓటును పరిశీలించుకోవాలని సూచన



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర మేయర్, ప్రథమ పౌరుడైన బీవై రామయ్య ఓటు జాబితా నుంచి గల్లంతైంది. ఆయన ప్రమేయం లేకుండానే నగరంలోని 19వ వార్డులో నమోదైన ఆయన ఓటును తొలగించారు. ఇలా ఎందుకు జరిగిందో తెలుసుకోవడానికి పూర్తి విచారణ చేయాలని బుధవారం సాయంత్రం కలెక్టరేట్ బంగ్లాలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ ఓటరు సవరణ సంక్షిప్త జాబితా–2024లో భాగంగా రెండు రోజుల క్రితం తన ఓటును పరిశీలించానన్నారు. అందులో తన పేరు లేకపోవడంతో అవాక్కయ్యానన్నారు. ఇది అధికారుల తప్పిదమా, లేకపోతే టీడీపీ నాయకుల అకృత్యమా అనే విషయమై విచారణ చేపట్టాలన్నారు. ఓటు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు అని, దానినే తొలగించేలా ప్రత్యర్థులు కుట్ర చేయడం అన్యాయమన్నారు. గతంలో తనకు గడివేములలో ఓటు ఉండేదని, అయితే 2021లో కర్నూలు నగరంలోని 19వ వార్డులో నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కర్నూలులోనే తాను నివాసం ఉంటున్నానని.. ఇక్కడ ఆధార్, ఓటు ఉందన్నారు. ఒకవేళ రెండు చోట్లా ఓటు ఉందని అధికారులు భావిస్తే తన వివరణతో ప్రాధాన్యత ప్రాంతంలో ఓటును ఉంచాల్సి ఉందన్నారు. అయితే తన వివరణ తీసుకోకుండా రెండు చోట్లా ఓటును తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటును పరిశీలించుకోండి

జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఓటును జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని మేయర్ బీవై రామయ్య సూచించారు. టీడీపీ నాయకులు అడ్డగోలుగా ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్న నేపథ్యంలో పరిశీలన చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తమ ఓటు విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

నిష్టతో ఆచారం.. నిండుగా భక్తిభావం

- నేటి నుంచి ఉరకుందలో శ్రావణ మాస ఉత్సవాలు
- మాంసం, మద్యం ముట్టని భక్తులు
- సోమ, గురు, శనివారాల్లో ప్రతి ఇంటి లోనూ పరమాన్నంతో నైవేద్యం

మంత్రాలయం: భక్తకోటి కల్పతరువు శ్రీ ఉరకుంద ఈరన్న స్వామి. గురువారం నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు శ్రావణ మాస వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉరకుంద స్వామి మహిమాన్వితుడిగా వర్ధిల్లుతున్నారు. స్వామికి నియమ నిష్టలతో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు ఆచరిస్తున్న నియమాల గురించి తెలుసుకుందాం..

- ■ శ్రావణమాసం అంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక చింతనలో నడుచుకుంటారు.
- ■ స్వామి కొలిచే భక్తులు ఇళ్లలో మాంసం వంటకాలు చేయడం, మద్యం సేవించడం అలవాట్లకు దూరంగా మెలగుతారు.
- ■ ప్రతి సోమ, గురు, వారాల్లో ఇళ్లలో పరమాన్నంతో నైవేద్యం పెట్టి ఇంటికొకరు ఉపవాస దీక్ష చేస్తారు.
- ■ ఎంత దూరంలో ఉన్నా.. స్వామికి బియ్యం, బేడలు, బెల్లం సమర్పించుకుంటారు.
- ■ మొక్కు ఉన్న భక్తులు మాత్రం స్వామి క్షేత్రంలో రాత్రి బస చేసి భక్షాలు, పాయసం వంటకాలు చేసి నైవేద్యంతో విశిష్ట పూజలు చేసుకుంటారు.
- ■ ఆచారంలో భాగంగా ఇంటికొకరు లేదా ముగ్గురు తలనీలాలు కచ్చితంగా ఇచ్చుకుంటారు.
- ■ ఈ నెలలో నాగుపాములను కొట్టడంగానీ, చంపడం వంటివి చేయరు.
- ■ ఇంటి దైవంగా తమ పిల్లలకు పుట్టు వెంట్రుకలు ఇక్కడే సమర్పిస్తారు.
- ■ సాధారణ రోజుల్లో వండే వంట పాత్రల్లో కాకుండా కొత్త పాత్రల్లోనే వంటలు చేసుకుంటారు.
- ■ శ్రావణ శుక్రవారం నోములు నోయడంలో ఆడపడుచులు నిష్ట పాటిస్తారు.
- ■ నాగుల చవితిని పురస్కరించుకుని నూతన దంపతులు పెళ్లి దుస్తులతో వెళ్లి నాగులకట్టకు పాలతో అభిషేకం చేస్తారు.
- ■ కులమతాలకు అతీతంగా ఇతర మతస్తులూ స్వామిని కొలవడం, నైవేద్యాలు సమర్పించడం ఇక్కడ చూస్తాం.
- ■ ఇళ్లలో పటాలతోపాటు పూర్ణకుంభం పెట్టి పూజలు చేస్తారు. స్వామి హారంగా జంజివరం(వెండిదండ) ప్రతి ఇంటిలో మహిళలు ధరిస్తారు.
- ■ పొలాల్లో విత్తు వేయాలన్న ముందుగా స్వామి చెంత కొన్ని విత్తనాలకు పూజ చేసుకున్నాకే విత్తు వేయడం ఆనవాయితీ.



ఈరన్నస్వామి మూల విరాట్

- ■ ఇళ్లలో శుభకార్యం ఉందంటే కచ్చితంగా పెళ్లి పత్రికలు తీసుకెళ్లి పూజలు చేసిన తర్వాతే బంధుమిత్రులకు ఆహ్వాన పత్రికలు పంచుతారు.
- ■ ఊరూరా వెలసిన నరసప్ప, లక్ష్మీనరసింహ, శివాలయాల్లో వారం వారం నైవేద్యాలతో పూజలు చేసుకుంటారు.
- ■ నాగుల పుట్టినిల్లుగా పుట్టలకు ఇక్కడ పాలు పోయడం, పూజలు చేయడం చేస్తారు.
- ■ స్వామికి గుర్తుగా నేటికీ ఉరకుంద, ఈరన్న, నరసింహ, వీరేష్ నామాలతో పేర్లు పెట్టుకుంటారు. పేర్లు మారినా కనీసం ఉ.,న.,వీ.,ఈ అక్షరంతో పేరు మొదలయ్యేలా చూసుకోవడం ఆచారం.

.. ఇలా ఉరకుంద ఈరన్న స్వామి ఆచారాలు తూచ పాటిస్తూ నెలంతా ఎంతో నిష్టగా వేడుతారు. ఏ పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

క్లుప్తంగా

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న జేసీబీ, ట్రాక్టర్లు

వెల్దుర్తి: బుక్కాపురం గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ మట్టి తరలిస్తున్న 12 ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిపిన దాడుల్లో మట్టి తవ్వి లోడ్ చేస్తున్న జేసీబీ, లోడింగ్ అయిన కొన్ని ట్రాక్టర్లు, కొన్ని ఖాళీ ట్రాక్టర్లు గుర్తించామన్నారు. మట్టిని రోడ్ల నిర్మాణాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి విచారణకు కేసును మైనింగ్, రవాణా శాఖకు అప్పజెప్పినట్లు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 14 మంది డిబార్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో బుధవారం 14 మంది విద్యార్థులు డిబారైనట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ సెమిస్టర్ పరీక్షలకు 10,115 మంది గాను 9,031 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. డోన్‌లోని జీవీఆర్ఎస్ డిగ్రీ కాలేజీలో ఇద్దరు, నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, ఎమ్మిగనూరు ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇద్దరు, డోన్ వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఒకరు, పత్తికొండ విజయసాయి డిగ్రీ కాలేజీలో ఒకరు, నందికొట్కూరు శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలలో ముగ్గురు, నంద్యాల బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజీలో ఒకరు డిబారైనట్లు వీసీ ఎ.ఆనందరావు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి



బోయ దస్తగిరమ్మ(ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన బోయ దస్తగిరమ్మ(42) బుధవారం పాముకాటుతో మరణించింది. రోజు మాదిరిగానే పొలం పనులకు వెళ్లి పని చేస్తుండగా కాలుకు కట్లపాము కాటు వేసింది. గమనించి తోటి కూలీలకు తెలుపగా వారు మెరుగైన వైద్యం కోసం డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలి పెద్ద కుమార్తె కూడా రెండేళ్ల క్రితం పొలంలో పని చేస్తుండగా తేలు కాటుతో మరణించింది. రెండేళ్ల వ్యవధిలోనే తల్లీ, బిడ్డ మృతి చెందడటంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతురాలికి భర్త నారాయణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పూజలకు వేళాయె!

- నేటి నుంచి శ్రీశైలంలో శ్రావణమాసోత్సవాలు
- రెండు, నాల్గవ శుక్రవారాల్లో ఉచితంగా సామూహిక వరలక్ష్మీవ్రతం
- రద్దీ రోజుల్లో గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల

శ్రీశైలంటెంపుల్: శ్రావణమాసంలో పూజలందుకునేందుకు శ్రీశైల మల్లన్న సిద్ధమయ్యాడు. శ్రావణ శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని భక్తులు గురువారం నుంచి నెలరోజుల పాటు పెద్ద సంఖ్యలో తరలిరానుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ ఎస్.లవన్న ఆదేశాల మేరకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సెప్టెంబరు 15వ తేదీ వరకు శ్రావణమాసోత్సవాలు కొనసాగనున్నాయి.

ఆలయ వేళలు

ప్రతిరోజు వేకువజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు జరిపిస్తారు. 4.30 గంటలకు ఉభయ దేవాలయాలలో మహామంగళహారతులు ప్రారంభించిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు సర్వదర్శనం కొనసాగుతుంది. సాయంత్రం 5.30 గంటలకు మహామంగళ హారతులు ప్రారంభించి, రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయి.

గర్భాలయ అభిషేకాలు నిలుపుదల

రద్దీ కారణంగా శ్రావణ శని, ఆది, సోమవారాలు, శ్రావణ పౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శ్రీకృష్ణాష్టమి ఆయా పర్వదినాల రోజులలో గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేశారు. ఇతర రోజులలో గర్భాలయ అభిషేకాలు, అభిషేకాలను యథావిధిగా నిర్వహిస్తారు. భక్తులు ఆర్జిత సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది. అభిషేకాలు నిలుపుదల చేసిన నిర్దిష్ట రోజులలో రోజుకు నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తారు.

అఖండ శివనామ భజనలు

లోకకల్యాణం కోసం శ్రావణమాసమంతా గురువారం నుంచి సెప్టెంబరు 15 వరకు అఖండ చతుస్సప్తాహ శివభజనలు జరిపిస్తారు. ఒక్కో భజన బృందంలో 45 మంది చొప్పున మొత్తం 7 భజన బృందాలు పాల్గొంటాయి.

సామూహిక వరలక్ష్మీ వ్రతములు

భక్తుల సౌకర్యార్థం శ్రావణ రెండవ శుక్రవారం (ఆగస్టు 25న) 750 మంది ముత్తైదువులకు, 250 మంది తెల్లరేషన్‌కార్డు కలిగిన ముత్తైదువులకు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిపిస్తారు. శ్రావణ నాల్గవ శుక్రవారం (సెప్టెంబరు 8న) 500 మంది చెంచు ముత్తైదువులకు, 500 మంది ఇతర భక్తులకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిపిస్తారు.



శ్రీశైలాలయం

పరోక్షసేవగా వరలక్ష్మీ వ్రతం

భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పరోక్ష ఆర్జితసేవగా వరలక్ష్మీవ్రతాన్ని చేసుకునే అవకాశాన్ని దేవస్థానం కల్పిస్తోంది. ఈ పరోక్షసేవకు రూ.1,116 సేవా రుసుం చెల్లించాలి. పరోక్షసేవ జరిపించుకున్న భక్తులకు కుంకుమ, విభూతి, కలకండ, అక్షింతలతో పాటు అమ్మవారి ప్రసాదం, రవిక వస్త్రం పోస్టు ద్వారా పంపనున్నారు.

సాధారణ రోజులలో స్పర్శదర్శనం

ప్రస్తుతం క్షేత్రంలో అమలుఅవుతున్న విధంగానే మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో (శ్రావణ పౌర్ణమి రోజు మినహా) భక్తులకు మధ్యాహ్నవేళలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు క్యూలైన్‌లో ప్రవేశించిన భక్తులకు మల్లికార్జున స్వామివారి ఉచిత స్పర్శదర్శనం కల్పిస్తారు. ఈ సమయంలో క్యూలైన్లలో ప్రవేశించిన భక్తులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్పర్శదర్శనం కల్పిస్తారు.

ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వం



శ్రావణ సోమవారాలు, పౌర్ణమి, శుద్ధ, బహుళ ఏకాదశి, శ్రావణమాసశివరాత్రి, ప్రభుత్వ సెలవు రోజుల్లో అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. క్యూలైన్లలో వేచిఉండే భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేస్తారు. అన్నదాన మందిరంలో రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ, సాయంత్రం అల్పాహారం ఉంటుంది. అవసరమైన మేరకు లడ్డూప్రసాదాలను తయారు చేసి అందుబాటులో ఉంచాలని సూచించాం.

– ఎస్ లవన్న, ఈఓ

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య



మద్దిలేటి(ఫైల్)

కర్నూలు: ''అప్పుదారులంతా కలసి ఒత్తిడి చేసి అవమానపరిచారు. కట్టుకున్న భార్యకు, వ్యాపార భాగస్వాములకు సమాధానం చెప్పుకోలేకపోతున్నా. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులకు విన్నపం. నేను మరణించిన తర్వాత దయచేసి నా కుటుంబాన్ని ఆదుకోండి..' అంటూ కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన కురువ మద్దిలేటి(52) సూసైడ్ నోట్ రాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు నగరం భాగ్యనగర్‌లోని ఎస్ఎస్‌పీ ఆర్కేడ్ సముదాయంలో మద్దిలేటి ఆల్బమ్ ప్రింటింగ్ ల్యాబ్ నిర్వహిస్తూ బృందావన్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఈయన కొడుకు వీరేంద్ర ఎంబీబీఎస్, కూతురు వైష్ణవి బీటెక్ చదువుతున్నారు. ఇద్దరు భాగస్వాములతో కలసి ల్యాబ్ నిర్వహిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేసేవాడు. కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో దాదాపు రూ.3 కోట్లకు పైగా అప్పులు చేసి తిరిగి చెల్లించలేక ఇబ్బంది పడ్డాడు. నెల రోజుల క్రితం వ్యాపార భాగస్వాములతో పాటు అప్పులు ఇచ్చినవారు డబ్బుల కోసం ఒత్తిడి పెంచడంతో తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి బుధవారం ఉదయం దూపాడు రైల్వే స్టేషన్ సమీపంలో శవమై కనిపించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. దాదాపు వంద మీటర్ల దాకా మృతదేహాన్ని రైలు ఈడ్చుకెళ్లిన ఆనవాళ్లు ఉన్నాయి. సమీపంలోనే మద్దిలేటికి సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. అందులోనే సూసైడ్ నోట్ లభించింది. భార్య జయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 19న నిర్వహిస్తున్న ఉప ఎన్నికలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు కోరారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనంలో స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్, నియమ నిబంధనల మేరకు పోలింగ్, కౌంటింగ్‌ను పక్కాగా నిర్వహించాల్సి ఉందన్నారు. ముఖ్యంగా సంబంధిత అధికారులు పేపర్ సీల్, బ్యాలెట్ పేపర్ అకౌంట్‌తో పాటు డైరీ నిర్వహణలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. 19న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో 17న సాయంత్రానికి ఎన్నికలకు అవసరమైన సామగ్రిని సంబంధిత ఎంపీడీఓ కార్యాలయాలకు చేరుస్తామన్నారు. 18వ తేదిన ఉదయం ప్రిసైడింగ్ అధికారులు ఆయా ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని సాయంత్రంలోగా పోలింగ్ కేంద్రాలకు చేర్చాలన్నారు. ఉదయం 6.30 గంటలకంతా సంబంధిత అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను చూపించాలని.. పోలింగ్ పూర్తయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బాక్సులకు సీల్ వేయాలని, ఓట్ల లెక్కింపు సమయంలో తిరిగి ఏజెంట్ల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేయాల్సి ఉంటుందన్నారు. పోల్ అయిన బ్యాలెట్ పేపర్లను 25 ప్రకారం కట్టలు కట్టి, ఏజెంట్ల సమక్షంలో లెక్కించాలన్నారు. అనంతరం ఎన్నికైన అభ్యర్థిని ప్రకటించి ధృవీకరణ పత్రాన్ని అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు డ్వామా ఏపీడీ సిద్ధలింగమూర్తి, సి.బెళగల్ ఎంపీడీఓ ఏసీ రాముడు, డీఎల్‌పీఓలు తిమ్మక్క, నూర్జహాన్‌తో పాటు 16 మంది స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులు, 22 మంది ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్ష వాయిదా

కర్నూలు (న్యూసిటీ): ఐబీపీఎస్ పరీక్షల కారణంగా రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 19న జరగాల్సిన బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షను వాయిదా వేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో పే ర్కొన్నారు. వాయిదా పడిన పరీక్షను 23వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

స్టెమి ప్రోగ్రామ్‌తో గుండెపోటు మరణాలకు అడ్డుకట్ట



డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న స్టెమి ప్రోగ్రామ్‌తో గుండెపోటు మరణాలకు అడ్డుకట్ట పడుతుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో స్టెమి ప్రోగ్రామ్‌పై సీహెచ్‌సీలలో పనిచేసే వైద్యులు, స్టాఫ్ నర్సులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన నాలుగు గంటల్లో రోగిని ఆసుపత్రికి తీసుకొచ్చి టెనెక్టప్లేస్(టీపీఏ) అనే ఇంజెక్షన్ ఇస్తే కోలుకునే అవకాశం ఉందన్నారు. త్వరలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, బేతంచర్ల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, పత్తికొండ, వెల్దుర్తి, కోడుమూరు, ఓర్వకల్, పాణ్యం, వెలుగోడు, మిడుతూరు సీహెచ్‌సీలలో స్టెమి ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. గుండెపోటని ఈసీజీలో తెలిస్తే అవసరమైన ప్రాథమిక వైద్యం చేసి సీహెచ్‌సీలోనే టీపీఏ ఇంజెక్షన్ ఇస్తారని, అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పంపుతారన్నారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ లలిత, పీజీలు డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల పరిధిలో నిఘా పెంచండి



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేస్తూ రైల్వే స్టేషన్ల పరిధిలో గస్తీని పెంచాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో రైల్వే పోలీసులతో కో–ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో జరిగే దొంగతనాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, జిల్లా కేంద్రంతో పాటు పాణ్యం, బేతంచెర్ల, డోన్, సిమెంట్ నగర్, బనగానపల్లె, సంజామల, గాజులపల్లె తదితర స్టేషన్లలో నిఘా పెంచాలన్నారు. ప్రయాణిస్తున్న రైలులో దొంగలు చైన్ లాగి దొంగతనాలు జరగకుండా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైళ్ల రాకపోకల సమాచారం, రైళ్లలో దొంగతనాలకు పాల్పడే వారి వివరాలను స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. అలాగే చోరీలకు పాల్పడే వారిని పట్టుకోవడానికి రైల్వే పోలీసులకు ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, నంద్యాల టౌన్ డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐ కోటేశ్వరావు, ఆర్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ నాగభూషణం పాల్గొన్నారు.

31న ఏపీ టూరిజం రెస్టారెంట్లకు బహిరంగ వేలం

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఏపీ టూరిజం రెస్టారెంట్ల నిర్వహణకు ఈనెల 31న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారిణి విజయ ఒక ప్రకటనలో తెలిపారు. కేతవరం వద్ద నిర్మించిన రెస్టారెంట్‌ను 15 సంవత్సరాలు, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం, సుంకేసుల వద్ద నిర్మించిన ఏపీ టూరిజం రెస్టారెంట్లు 33 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇస్తామన్నారు. 31వ తేదీ ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో బహిరంగ వేలం ఏర్పాటు చేశామన్నారు. ఇతర వివరాలకు 8247704152, 6309942034 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



రవిచంద్ర(ఫైల్)

పాములపాడు: స్థానిక ఏఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ రవిచంద్ర(55) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. బానుముక్కల గ్రామానికి చెందిన రవిచంద్ర కర్నూలులో నివాసం ఉంటున్నాడు. ఎప్పటిలాగే ఉదయం విధులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతుండగా గుండెనొప్పి రావడంతో కర్నూలులోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న హెచ్ఎం వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కూల్లో రవిచంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఆస్ట్రేలియాలో ఉన్న సోదరుడు రావడానికి రెండు రోజులు సమయం పడుతుందని అతడు వచ్చిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

కల్లూరు: మండల పరిధిలోని దూపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఎంఈఓ–1 శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎంఈఓ–1 పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించగా కరెక్షన్ చేయకపోవడం గమనించారు. కరెక్షన్ చేసిన వాటిలో తప్పులు రాసిన కూడా వాటికి మార్కులు ఇవ్వడం గుర్తించారు. సదరు హెచ్ఎం గతంలోనూ ఇలాగే వ్యవహరించారని ఎంఈఓలు హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను సబ్జెక్టుల వారీగా కరెక్షన్ చేసి, తప్పొప్పులను సరిదిద్ది మండల విద్యాశాఖ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. లేనిపక్షంలో జీతం నిలిపివేస్తామని హెచ్చరించారు.

తల్లి చేతి నుంచి జారిపడి శిశువు మృతి



మృతిచెందిన బాలుడు తేజేశ్వర్

కర్నూలు: నగరంలోని ఎర్రబురుజులో నివాసముంటున్న సాయికృష్ణ, అమృతకుమారి దంపతుల కుమారుడు తేజేశ్వర్(5 నెలలు) తల్లి చేతిలో నుంచి జారి కింద పడ్డాడు. తలకు గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. వీరికి ఏడాది క్రితం వివాహమైంది. సాయికృష్ణ ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అమృతకుమారి ఐదు నెలల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. మూడు రోజుల క్రితం బిడ్డకు పాలివ్వడానికని మంచం పైనుంచి ఎత్తుకుంటుండగా ప్రమాదవశాత్తూ చేతిలో నుంచి జారి కింద పడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యచికిత్సలు చేయించారు. కోలుకోలేక బాలుడు మృతిచెందాడు. ఒకటవ పట్టణ పోలీసులు శిశువు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆర్.సామేల్ (ఫైల్)

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం వద్ద బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఆర్.సామేల్ (45) అనే వ్యక్తి మృతిచెందాడు. ఆర్.సామేల్ రాంపురం గ్రామంలో తన భార్య ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై కుమార్తె సుధారాణి, కుమారుడు వినయ్‌కుమార్‌తో బయల్దేరారు. మాధవరం సమీపంలో కుక్క హఠాత్తుగా అడ్డువచ్చింది. తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో సామేల్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్తె సుధారాణి తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలించారు.

లైంగిక దాడి ఘటనపై విచారణ

తుగ్గలి : మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో ఎస్సీ మహిళపై అదే గ్రామానికి చెందిన ఉపేంద్రగౌడ్, రామానాయుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి బుధవారం పోలీసులు విచారణ చేపట్టారు. సీసీఎస్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళా సీఐ సుగుణకుమారి బాధిత మహిళతో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. ఘటనకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కర్నూలు: కర్నూలు నగరం ప్రకాష్ నగర్‌కు చెందిన హర్షవర్ధన్ (18) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికంగా ఉంటున్న మద్దిలేటి, సువర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం కాగా, రెండవ వాడైన హర్షవర్ధన్ కూలీ పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద నీళ్ల మోటార్‌కు పైపు బిగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల పెంపకానికి రూ.కోటి వరకు రుణాలు

- 100 నుంచి 500 వరకు యూనిట్లతో పరిశ్రమలు
- నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ
- దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) ద్వారా గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇస్తోంది. గరిష్టంగా రూ.కోటి విలువ చేసే యూనిట్లను పంపిణీ చేయడానికి రంగం సిద్ధమైంది. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గొర్రెలు, మేకల పెంపకానికి ఇచ్చే ప్రోత్సాహకాలపై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్ఎల్ఎం ద్వారా రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు సన్న జీవాల పెంపకానికి ప్రోత్సాహకం లభిస్తుంది. సబ్సిడీ 50 శాతం ఉంటుంది. గొర్రెలు, మేకల పెంపకాన్ని పరిశ్రమగా ఎన్ఎల్ఎం గుర్తించింది. గొర్రెల పెంపకానికి సంబంధించి ఎన్ఎల్ఎం రుణాల పంపిణీకి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంటు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న భవానిశంకర్‌రెడ్డి నోడల్ అధికారిగా నియమితులయ్యారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, జేఎల్‌జీ గ్రూపులు తదితర వాటికి ఎన్ఎల్ఎం రుణాలు మంజూరు చేస్తారు. రుణాల కోసం దరఖాస్తులను tenders@apurban.inలో అప్‌లోడ్ చేయాలి. గొర్రెల పెంపకానికి అవసరమైన భూమి, మేతకు సంబంధించి పచ్చిక బయళ్లు తదితర వాటికి సంబంధించిన వివరాలు, వాటికి సంబంధించి డాక్యుమెంట్లు ఉండాలి. గొర్రెల పెంపకంలో అనుభవం ఉన్నట్లు స్థానిక పశువైద్యుల నుంచి సర్టిఫికెట్ కూడా ఉండాలి. రుణం ఇస్తామంటూ బ్యాంకరు ఇచ్చిన మంజూరు పత్రం జత చేయాలి. దరఖాస్తు వెంట డాక్యుమెంట్లను విధిగా అప్‌లోడ్ చేయాలి. 100 నుంచి 500 వరకు జీవాలను ఐదు రకాల యూనిట్లుగా పంపిణీ చేస్తారు. దీనిని 2025 సంవత్సరం వరకు అమలు చేస్తారు. లక్ష్యాలు అంటూ ఉండవు. ఎన్ని సంఘాలకైన రుణ వసతి లభిస్తుంది. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తులు నేరుగా రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌కు వెళ్తాయి. అక్కడ ఆమోదం పొందిన తర్వాత నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌కు వెళ్తాయి.

యూనిట్లు ఇలా...

100 గొర్రెలు, మేకలు, 5 పొట్టేళ్లు(మొత్తం 105) యూనిట్ కాస్ట్ రూ.20 లక్షలు ఉంటుంది. 200 గొర్రెలు, 10 పొట్టేళ్లు(మొత్తం 210(యూనిట్ రూ.40 లక్షలు ఉంటుంది. 300 గొర్రెలు, 15 పొట్టేళ్లు(మొత్తం 315) యూనిట్ కాస్ట్ రూ.60 లక్షలు, 80 గొర్రెలు, 20 పొట్టేళ్లు(మొత్తం 420) యూనిట్ కాస్ట్ రూ.80 లక్షలు, 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు(మొత్తం 525) యూనిట్ కాస్ట్ రూ.కోటి. ఇందులో 50 శాతం సబ్సిడీ లభిస్తుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే సబ్సిడీ చివరిలో విడుదలవుతుంది. మరిన్ని వివరాలను సంబంధించి పశువైద్యులను సంప్రదించవచ్చు. నోడల్ అధికారి డాక్టర్ భవానిశంకర్‌రెడ్డి మొబైల్ నంబరు 91823 07032 కు ఫోన్‌చేసి సంప్రదించవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. విజయవాడలోని పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌లోని ఎన్ఎల్ఎం కాల్ సెంటరు 70131 95961 నంబరుకు కూడా ఫోన్ చేసి వివరాలు పొందవచ్చు.